విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 1, మార్చి 2025

నిరాశాజనకంగా రాష్ట్ర బడ్జెట్

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

విశాలాంధ్ర, ఉరవకొండ శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 2025- 26 సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆరోపించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా పేద, బడుగు, బలహీన వర్గాల వారికి, రైతులు మహిళలకు కూటమి ప్రభుత్వం మోసం చేసిందని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి కంటే డబుల్ ఇస్తామని ఎన్నికల్లో నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సంక్షేమ పథకాలకు నామమాత్రంగా నిధులు కేటాయించారన్నారు. నిరుద్యోగ భృతి ఉచిత బస్సు, 50 సంవత్సరాలకే పెన్షన్ ఇలాంటి పథకాలు బడ్జెట్లో ఊసే లేదన్నారు.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ..

ఎమ్మెల్యే పరిటాల సునీత

విశాలాంధ్ర-రాప్తాడు : రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏపీ బడ్జెట్ ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ఆమె హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.13,487 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.47,456 కోట్లు, ఆదరణ పథకం కోసం రూ.1000 కోట్లు కేటాయించడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. చేతివృత్తుల వారికి అండగా నిలిచే ఆదరణ పథకాన్ని నిలిపివేసి బీసీలను అన్యాయం చేశారన్నారు. పోలవరం, అమరావతి వంటి అభివృద్ధి కార్యక్రమాలకు, గృహ నిర్మాణం, రోడ్ల నిర్మాణాలకు బడ్జెట్ కేటాయింపులు చేస్తూనే, పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేసే విధంగా కేటాయింపులు చేశారన్నారు. హంద్రీ-నీవాకు రూ.3200 కోట్ల కేటాయించారని త్వరలోనే పేరూరు జలాశయానికి నీరందించే పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలను ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర గుంతకల్ : ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి అఖిల్‌కుమార్ పట్టణ ప్రధాన కార్యదర్శి శివమని డిమాండ్ చేశారు. స్థానిక బి టి పక్కిరప్ప భవన్‌లో ఏఐఎస్ఎఫ్ పట్టణ సమితి ఆధ్వర్యంలో వారు మాట్లాడుతూ గుంతకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నారాయణ జూనియర్ కళాశాల శంకరానంద జూనియర్ కళాశాల సరస్వతి జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు రేపటి నుంచి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి కాబట్టి డాక్టర్లను హెల్ప్ డెస్క్‌ను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హాన్ మహేంద్ర ముస్తఫా అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం..

విశాలాంధ్ర, గుత్తి : గుంతకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అమ్మ శారదమ్మ, ఎమ్మెల్యే తమ్ముడి భార్య త్రివేణి జ్ఞాపకార్థం శుక్రవారం గుత్తి పట్టణం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు ఉచిత పోషకాహారం అందజేశారు. ముఖ్య అతిథిగా గుత్తి మండల టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి హాజరయ్యారు. దాత మూర్తి సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. టీడీపీ, బిజెపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

విశాలాంధ్ర, బొమ్మనహాళ్: క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి బాగా రాణించాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తనయుడు కాల్వ భరత్ క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఎఱ్ఱేరంగనాథస్వామి ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల నుండి మండల స్థాయి వాలీబాల్ పోటీలు హోరా హోరిగా సాగాయి. ఉద్దేహాల్ జట్టు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి గోవిందవాడ జట్టు రూ.5 వేలు గెలుచుకున్నాయి. వాలీబాల్ పోటీలకు బహుమతుల దాత తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పయ్యావుల శ్రీకాంత్, బొమ్మనహాల్ నవీన్‌ల ఆర్థిక సహాయం ను మాజీ మంత్రి కాలువ తనయుడు కాల్వ భరత్ చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు.

బాల్య వివాహాలు వద్దు..

విశాలాంధ్ర, డి.హీరేహాల్ స్థానిక అంబేద్కర్ కాలనీలో మునివేలు గురు ప్రసాదరెడ్డి ఇతర అధికారులతో కలిసి పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర హక్కులు, బాల్య వివాహాల చట్టం గురించి అవగాహన కల్పించారు. గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపి చదివించాలన్నారు. వీఆర్వో, అంగన్వాడి టీచర్ భాగ్యవతి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

విశాలాంధ్ర, యాడికి : పెద్ద పప్పూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గార్లదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద యక్కలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో తాడిపత్రి డివిజన్ జిపియంవోవో మధుసూదనరాజు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 97 మంది విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పెద్ద యక్కలూరు రాజశేఖర్, సుదర్శనాచార్యులు, పాల్గొన్నారు.

అన్న సంతర్పణ

విశాలాంధ్ర, కనేకల్ : మారంపల్లి గ్రామంలోని వైసీపీ కార్యకర్త మారేంపల్లి మారేన్న ఆధ్వర్యంలో, కనేకల్ గ్రామంలో వెలిసిన శ్రీ వడియార్ చిక్కనేశ్వర స్వామి దేవాలయంలో అన్న సంతర్పణ నిర్వహించారు. శివరాత్రి అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి కుటుంబం పాల్గొన్నారు.

సర్ సీవీ రామన్ ఆదర్శం

విశాలాంధ్ర-రాప్తాడు : భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ సేవలను యువత ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తు తరాలకు దిక్సూచి కావాలని కళాశాల కరస్పాం డెంట్ వీ.బీ.ఆర్.శర్మ, చైర్మన్ బి.వి.క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రరెడ్డి తెలిపారు. హంపాపురం సమీపంలోని ఎస్వీ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ మోడల్స్‌ను ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.విష్ణువర్ధన్, ఏఓ వెంకటశివారెడ్డి, పాల్గొన్నారు.

పశు వైద్య విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం: ఫిబ్రవరి 3వ తేదీ నుండి శ్రీ వెంకటేశ్వర పశువైద్య విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తరగతులు బహిష్కరించి చేస్తున్న సమ్మెను విరమింప చేసేందుకు వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవిన్యూ అధికారి మలోలకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర పశువైద్య విద్యాలయ అనుబంధ కాళాశాలలైన తిరుపతి, పొద్దుటూరు, గన్నవరం, గరివిడి విద్యార్థులు ఫిబ్రవరి 3వ తేదీనుండి క్లాసులను బహిష్కరించి సమ్మెను నిర్వహిస్తూ రిలే దీక్షలు చేస్తున్నారు. వారి సమస్యలను తిరుపతిలోని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వర్యులు అచ్చెన్నాయుడు, నారా లోకేష్ కి తిరుపతిలోని యూనివర్సిటీ వైఛాఛాన్సలర్ గార్ల దృష్టికి స్వయంగా విన్నవించారు. ప్రభుత్వం సమ్మె చేస్తున్న విద్యార్థుల ప్రతినిధులను చర్చలకు ఇంతవరకు ఆహ్వానించలేదు.విద్యార్థులు ఇంటర్న్ షిప్ చేసే సమయంలో వారికి ఇచ్చే స్టై ఫండ్ 2013 నుండి రూ.7,000 నుండి రూ. 12,000 మాత్రమే ఉంది. జనరల్ వైద్యవిద్యను చదివే విద్యార్థులకు స్టైఫండ్ రూ.25 వేల నుండి రూ.65,000 వరకు ఉంది. దేశానికి వెన్నుముకలాంటి రైతులు పెంచే పశువులకు వచ్చే వ్యాధుల బారీ నుండి కాపాడుతూ పశు సంపద అభివృద్ధికి తోడ్పడుతున్న భవిష్యత్తు పశు వైద్యుల పట్ల ప్రభుత్వము నిర్లక్ష్యం వీడనాడాలని, సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేయాలి పశువైద్య విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వెటర్నరీ కాలేజీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను, పశువైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పశువైద్య పోస్టులను భర్తీ చేయాలని, రూరల్ లైవ్ స్టాక్ యూనిట్లను అప్ గ్రేడ్ చేసి పశువైద్యులను నియమించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి. రామకృష్ణ బండి రామకృష్ణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రామాంజనేయులు జిల్లా ఉపాధ్యక్షులు ధనుంజయ రైతు సంఘం నాయకులు వెంకట్రా ముడు, భాష, దుర్గాప్రసాద్, గోవింద్ పాల్గొన్నారు.

స్టే ఫండ్స్‌ను తక్షణమే పెంచాలి

విశాలాంధ్ర-రాయదుర్గం: పశు వైద్య విద్యార్థులకు స్టేఫండ్స్‌ను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు కుల్రేష్ డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గం కోశాధికారి దినకర్ ఉపా అధ్యక్షులు రాజు మున్నా తరుణ్ మాధవ్ పుష్ప ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కుమార్ ఏఐవైఎఫ్ నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

యాడికిలో ఆందోళన

విశాలాంధ్ర, యాడికి : వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్ ఆధ్వర్యంలో సిపిఐ నాయకులతో కలిసి యాడికి మండల పశువైద్య ఆధికారికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట రాముడు యాదవ్ మాట్లాడుతూ గుంటూరు శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయ విద్యార్థులు ఈనెల 3వ తేదీ నుండి క్లాసులు బహిష్కరించి సమ్మె నిర్వహిస్తున్నారు. సమ్మెలో భాగంగా శుక్రవారం గుంటూరు పశువుల ఆస్పత్రిలో సమ్మె చేపట్టిన విద్యార్థులకు సంఘీభావంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ బృందం పాల్గొని మద్దతు తెలిపారు. తిరుపతి, ప్రొద్దుటూరు, గరివిడి, గన్నవరం తదితర కళాశాలలో తరగతులు బహిష్కరించి రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. 2013 నుండి రూ.7 వేల స్టైఫండ్‌తో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2022లో42 రోజులపాటు విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని, కళాశాలలో ఫ్యాకల్టీ ప్రొఫెసర్స్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1500 పైగా పశు వైద్య డాక్టర్ల ఖాళీలను భర్తీ చేయాలని ఆందోళన నిర్వహించగా ఆనాటి ప్రభుత్వ శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు గన్నవరం కాలేజీ వద్దకు వచ్చి డిమాండ్స్‌ను సంపూర్ణంగా అంగీకరిస్తున్నట్లు ప్రకటించినా ఏ ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. తిరుపతి విద్యార్థులకు డిసెంబర్ నుండి,. ప్రొద్దుటూరు, గన్నవరం, ప్రొద్దుటూరు విద్యార్థులకు నవంబర్ నుండి స్టైఫండ్ చెల్లించాల్సి ఉందన్నారు. 260 మంది గోపాల మిత్ర సిబ్బంది పర్మినెంట్ చేసి వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజక వర్గ కార్యదర్శి ఓబిరెడ్డి, యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, రైతు సంఘం నాయకులు ఆదిరంగారెడ్డి, చిన్న కుల్లారెడ్డి, రంగం ఓబులయ్య ,గరిడి శివన్న పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి : జేసీ

విశాలాంధ్ర, శింగనమల రీసర్వేని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. శింగనమల మండలంలోని మట్లగొంది గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే కోసం ప్రతి గ్రామంలో 4 ఉదయం రెండు టీంలు, మధ్యాహ్నం రెండు టీంలు గ్రౌండ్ ట్రూ థింగ్ ప్రక్రియను ప్రజల సమక్షంలో చేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి వారి గ్రామంలో ఏరోజు ఎక్కడ రీసర్వే జరుగుతుందో సమాచారం ఇవ్వడం జరుగుతోందని, రీసర్వేని ప్రజలందరూ ఉపయోగించు కోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో పక్కాగా రీసర్వే చేపట్టాలని ప్రజల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. రీసర్వే చేసే పొలాల సమాచారం రైతులకు ముందుగా తెలిపి వారి సమక్షంలో సర్వే పనులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, వంకలు, రహదారులు విస్తీర్ణములు సక్రమంగా

నమోదు చేయాలన్నారు. వివాదమైన భూముల విషయంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్సిసి ఎస్డీసి తిప్పేస్వామి, సర్వే ఏడి రూప్లా నాయక్, తాసిల్దార్ బ్రహ్మయ్య, మండల సర్వేయర్, వీఆర్వోలు గ్రామ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్ పై రాజ ద్రోహం కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మరో వివాదంలో చిక్కుకున్నారు. నిన్నటి రోజు విజయవాడ పోలీసుల నుంచి నోటీసులు అందుకున్న మాధవ్ రాష్ట్రంలో అంతర్యుద్ధం రానుందంటూ చేసిన వ్యాఖ్యల మీద తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశంపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనల మేరకు ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. దానికి సంబంధించిన వీడియోలను అందజేశారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించి.. వ్యక్తులు, వర్గాల మధ్య వైశ్యమ్యాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. అందుకే గోరంట్ల మాధవ్‌ని అరెస్టు చేసి విచారించాలన్నారు. దీనిపై ఎస్పీ కూడా సానుకూలంగా స్పందిం చారని వివరించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు గంగారామ్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహా, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్ మాట్లాడుతూ మొదటి నుంచి వివాదాలతో గోరంట్ల మాధవ్ వార్తల్లో ఉన్నారని.. ఆయన పబ్లిసిటీ కోసం ఏమైనా చేస్తారన్నారు. సీఐగా ఉన్నప్పటి నుంచి తీరు ఇలానే ఉందన్నారు. అత్యాచార బాధితుల పేర్లను బహిరంగంగా చెప్పినందుకు కేసులు నమోదయ్యాయన్నారు. దీనిపై ఫిర్యాదు చేసింది కూడా గతంలో వైసీపీలో ఉన్న వాసిపద్మ అని గుర్తు చేశారు. దీనిపై కూటమి ప్రభుత్వానికి ఏంటి సంబంధం అని నిలదీశారు.

కనేకల్ చెరువులోకి వచ్చిన తుంగభద్ర జలాలు..

విశాలాంధ్ర, కనేకల్ : కనేకల్ గ్రామంలో ఉన్న చెరువుగట్టులోకి కర్ణాటకలోని హెూస్పేట డ్యాం నుండి తుంగభద్ర జలాలను 0.5 టిఎంసి జలాలు కనేకల్ గ్రామంలోని చెరువులోకి వచ్చి చేరు తున్నాయి. ఈ జలాల కోసం ఎమ్మెల్యే కాలు శ్రీనివాసులు కనేకల్ లోని రైతుల తడి పంటల మాగానీల కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి అలాగే కర్ణాటకలోని డ్యాం వారితో పై అధికారులతో మాట్లాడి ఒప్పించి.. ఈ తుంగభద్ర జలాలను కనేకల్ చెరువులోకి రప్పించారు ఎమ్మెల్యే కాలు శ్రీని వాసులు. శుక్రవారం కనేకల్ చెరువులో నుండి ఈ తుంగభద్ర జలాలను దిగువ వారికోసం కూడా వదిలారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు హెచ్.ఎల్.సి డిపార్ట్మెంట్ వారు రైతులందరూ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మొండిచేయి

ఎస్.టి.యు నాయకులు

విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం: ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలిక వేల కోట్ల బకాయిల చెల్లింపు ఊసే లేదు! కోరి తెచ్చుకొనందుకు ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని ఎస్టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్. రమణారెడ్డి, ఎస్. రామాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ జీఎల్ఐసి మెచ్యూరిటీ క్లెయిమ్స్‌కు నిధుల కేటాయింపు ఊసేలేదూ.. వీటి కోసం రెండేళ్ళ నుండి ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు. పాలసీ కాలపరిమితి తీరిన తరువాత, కొందరు అనారోగ్యంతో మరికొందరు ప్రమాదవశాత్తు సర్వీసులో మరణించారు వారి డెత్ క్లెయిమ్ నామినీకి ఇవ్వక రెండేళ్ళు దాటిపోయింది ఇంతకంటే దారుణం,ఘోరం ఇంకొకటి ఉండదని మండి పడ్డారు. దేశంలోని అన్ని ఇన్సూరెన్స్ కంపెనీలను రెగ్యులేట్ చేసే "ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా" కూడా నోరు మూసుకొని ఉండటం ఆశ్చర్యకరమన్నారు. పిఎఫ్ లోన్ పేమెంట్లు, ఫైనల్ పేమెంట్ల చెల్లింపుకై నిధుల కేటాయింపులు, ఉద్యోగుల నెలవారి పిఎఫ్ శాలరీ డిడక్షన్‌లు కూడా పాలనకు వినియోగిస్తున్నారు కానీ వారి అత్యవసరాలకు నిధులు కేటాయింపులు లేవు. సి పి ఎస్/జి పిఎస్ అని సిపిఎస్ రద్దు కొరకు ప్రతిపాదన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం ఉద్యోగులను, ఉపాధ్యాయులను మరోసారి సిఎం మోసం చేయడమే అన్నారు. కూటమి ఎన్నికల హామీ 12 వ పి ఆర్ సి కమీషన్ నియామకం, మధ్యంతర భృతి ఐఆర్ ప్రకటనకై ఎదురు చూస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు శరాఘాతం ఈ బడ్జెట్ అన్నారు. 2019 జులైలో 11వ పి ఆర్ సి తాలూకా ఐఆర్ తీసుకుని ఇప్పటికే 5 సంవత్సరాల 8 నెలలు అయ్యింది. 12వ పి ఆర్‌సి అమలు చేయవలసినది 2023 జులై నుండి అయితే ఇప్పటికే ఈ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు 20 నెలల కాలాన్ని నష్టపోయారన్నారు. ఆర్థిక సర్వీసు పరమైన సమస్యలను మానవతావాదంతో ఆలోచించడం లేదని.. ఉద్యోగులంతా ఉద్యమించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సబ్సిడీ రుణాలను గ్రామ సభల్లో ఎంపిక చేసి మంజూరు చేయాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం: వెనకబడిన వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సబ్సిడీ రుణాలను ప్రజల సమక్షంలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తే న్యాయబద్ధంగా ఉంటుందని జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున కోరారు. స్థానిక బీసీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బిసి రుణాలు అంశాలను ప్రధాన డిమాండుతో శుక్రవారం వృత్తిదారుల సమాఖ్య ఆద్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంరక్షణలో గ్రామ సభలు నిర్వహిస్తే బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ నాయకులు గ్రామసభలు నిర్వహించకుండా తమ ఇళ్లల్లో ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షులు సి. లింగమయ్య మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు మంచి ఉద్దేశంతో బీసీ సబ్సిడీ రుణాలు అందించాలని నిర్ణయం చేశారని, అయితే రాజకీయ జోక్యం చేసుకొని సబ్సిడీ లోన్లను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సి.వి.హరికృష్ణ మాట్లాడుతూ రాజకీయ జోక్యం వలన బీసీ సబ్సిడీ రుణాలు అర్హులైన వారికి అందడం లేదన్నారు. ధర్నా అనంతరం బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రాన్ని అందజేశారు. రాప్తాడు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, సిపిఐ జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు శ్రీశైలం రాజేష్ గౌడ్, చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు సి నాగప్ప, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు గుండ్లకొండ రామాంజనేయులు, చేతి వృత్తిదారుల సమాఖ్య నగర అధ్యక్షులు కార్యదర్శి భూషణ, గౌరవాధ్యక్షులు ఈశ్వరమ్మ, యువజన సమాఖ్య జిల్లా నాయకులు ధను, నాయి బ్రాహ్మణ వృత్తి దారుల సమాఖ్య నగర అధ్యక్షులు గోవిందరాజులు, గీత కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రఘు, రైతు సంఘం నాయకులు రామకృష్ణ భాష వెంకట్ రాముడు, నారాయణస్వామి, శివా,ఆదినారాయణ, దుర్గాప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించాలి

మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా

విశాలాంధ్ర, గుత్తి : మునిసిపాలిటీ పరిధిలో మార్చి 1న పింఛను పంపిణీ , 2024-25 ట్యాక్స్ కలెక్షన్స్, ఎం .ఎస్ ఎం .ఈ సర్వే, పి 4 సర్వే, మిస్సింగ్ ఎంప్లాయి డేటా అప్డేషన్ సర్వే లను పూర్తి చేయుటకు గాను సంబంధిత సచివాలయ స్పెషల్ అధికారుల నోడల్ అధికారులకు సచివాలయ సిబ్బందికి శుక్రవారం మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పన్నులు వసూలు మార్చి 20లోపు పూర్తి చేయాలని తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో గల ప్రతి వర్తక నిర్వహణ దుకాణ వివరాలను ఎం.ఎస్.ఎం. ఈ సర్వేలో భాగంగా దుకాణ వివరాలను నమోదు పూర్తి కావాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా నిర్వహించబడు తున్న ఎంప్లాయ్ డేటాను సంబంధిత యాప్‌లో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మార్చి 1న పింఛను పంపిణీని లబ్దిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం 7.00 గంటల నుండి సిబ్బంది వారందరూ సేవాభావంతో పనిచేసి మొదటి రోజు 100% శాతం పూర్తి చేసే విధంగా నోడల్ అధికారులు సిబ్బంది వారిని పర్యవేక్షణ చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదపు చెత్త వేరుచేయడం, వాటిని మునిసిపాలిటీ వాహనానికి అందించి పరిసరాలను పరిశుభ్రంగా ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు, ఆర్.ఓ కమలాకర్ సతీష్, ఆర్.ఐ షెక్షావలి, నోడల్ అధికారులు సచివాలయ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన కాల పద్ధతులను నేటికి గొప్ప ఆవిష్కరణలు

విశాలాంధ్ర-జెఎన్టియుపి: ప్రాచీన కాల పద్ధతులను నేటికి గొప్ప ఆవిష్కరణలు అని జెఎన్‌టియు భౌతిక శాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ ఆర్. పద్మ సువర్ణ పేర్కొన్నారు. పివికెకే ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్) హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డా. బండి రమేష్‌బాబు అధ్యక్షతన జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రో.పద్మ సువర్ణమాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం ఆవశ్యకతను, ప్రాచీన కాల పద్ధతులను నేటి కాలానికి అనుసంధానిస్తూ దానిలోని పరమార్థాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ ఉత్తేజపరిచారు. అనంతరం కళాశాల చైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ.. విజ్ఞాన శాస్త్రాన్ని ప్రస్తుత కాలంలో అవలంబిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైబర్ సెక్యూరిటీల వినియోగంను వివరించారు.

పంచాయతీ స్థలాలను కాపాడండి

విశాలాంధ్ర, ఉరవకొండ : ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న లక్షలాది రూపాయలు విలువ చేసే గ్రామపంచాయతీ స్థలాలు, రోడ్లను కాపాడాలని ఉరవకొండ మేజర్ గ్రామపంచా యతీ వార్డు సభ్యులు గ్రామ కార్యదర్శి ఈవో గౌస్ సాహెబ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సర్పంచ్ మీనుగా లలిత అధ్యక్షతన గ్రామపంచాయతీ సమావేశం నిర్వహించారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పబ్లిక్ స్థలాలను కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని.. అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. ఉరవకొండ పట్టణంలో పంచాయతీ అధికారులు అనుమతి లేకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతున్నారని వాటికి కూడా అడ్డుకట్టు వేయాలన్నారు నేషనల్ హైవే బైపాస్ రోడ్డులో వివిధ గ్రామ పంచాయతీ స్థలాల్లో పంచాయతీ అధికారుల అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వ్యాపార నిర్వహణకు సంబంధించి బంకులను ఏర్పాటు చేస్తున్నారని.. అలాంటి వాటిని కూడా గుర్తించి తొలగించాలన్నారు. ఉరవ కొండలో చెత్త సేకరణ పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరచాలన్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. శానిటేషన్ సిబ్బందిని కూడా పెంచాలన్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి గౌస్ సాహెబ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థలాలు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని. అనుమతి లేకుండా నిర్మించిన భవనాలపై అవసరమైతే కోర్టుకు సైతం వెళ్తామని తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

అగ్రగామిగా నిలుస్తున్న అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల ..

వ్యవసాయం, విద్య ప్రగతికి నాంది పలికిన అనంతరాముడు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: అనంతపురం జిల్లాలో ఉన్నత ప్రమాణాలతో సాంకేతిక బోధన, ఉపాధి కల్పన, పరిశోదాత్మక అధ్యయనం, వికాసానికి నిలయంగా నిలుస్తున్న అనంతలక్ష్మి అనంతలో అగ్రగామిగా తనదైన ప్రతిభను చాటుతో విద్యా ర్థులు, తల్లిదండ్రుల హృదయాలలో చోటు సంపాదించుకుని విజయ శిఖరాలను అధిరోహిస్తూ తనదైన ముద్ర చాటుకుంది. అనంత రాముడు జన్మదినోత్సవం, కళాశాల ఆవిర్భావ దినోత్సవం గా.. ఎన్నో మైలు రాళ్లను దాటుకొని 17వ అనంతలక్ష్మి వార్షికోత్సవ అడుగుపెడుతూ.. అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నికల్ కోర్సులను ప్రవేశపెట్టి ఫలాలను అందిస్తూ ఉంది. వ్యవసాయం, విద్య రెండు కళ్ళుగ భావించి.. వ్యవసాయం జీవన ఆధారంగా ముఖ్యభూమికను పోషించిన అనంత రాముడు అనుతిర కాలంలోనే బిందు, డ్రిప్, సూక్ష్మ నీటి విధానంతో పండ్ల తోటలో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి ఉత్తమ రైతుగా, అనంతపురం జిల్లా పండ్ల తోటల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తనదైన ముద్రను చాటుకున్నారు. ఇంజనీరింగ్ కోర్స్ కోసం హైదరాబాద్ ,బెంగళూరు, చెన్నైకు వలసలు వెళ్లే అవసరం లేకుండా ఉన్న ప్రాంతంలోనే విద్యార్థుల కలలు స్వప్నాలను నెరవేర్చినందుకు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలను ఆవిర్భవించి .. రైతుల ఆశయాలను, విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక, విజయ శిఖరాలను అధిరోహించేందుకు తోడుగా.. నిలుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ. పారిశ్రామిక కంపెనీలలో ఉద్యోగ కల్పనను అందిస్తూ.. తమదైన ముద్రను చాటారు.

ఉద్దేహాళ్ వాసి కర్నాటకలో మృతి

విశాలాంధ్ర, బొమ్మనహాళ్ .. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన శివశంకర్. (28) కర్నాటకలోని తోరణగల్లు వద్ద ఓ కార్మాగారంలో మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అంజలి, మల్లేష్ దంపతుల కుమారుడు శివశంకర్ జిందాల్ కార్మాగారంలో అకౌంట్ సూపర్వైజర్గా పనిచేస్తున్నాడు గురువారం కార్మాగారంలోని నీటి ట్యాంక్‌లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. అయితే ప్రమాదవశాత్తు మరణించలేదని ఎవరో కావాలనే నీటిలోకి తోసేసి చంపేశారని కుటుంబ సభ్యులు అరోపించారు. శివశంకరుకు ఏడాది క్రితమే డి. హీరేహాళ్ మండలం లోని బాదనహాళ్ గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహం అయ్యింది. మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి తీసుకు రావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. తోరణగల్లు పోలీసులకు పిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలకు చిల్లు..

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం: రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 2025- 2026 వార్షిక బడ్జెట్ అంతా అంకెల గారడీ అని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మరోసారి చంద్రబాబు తన మోసపూరిత నైజాన్ని చాటుకుంటూ సూపర్‌సిక్స్ హామీలకు 'చిల్లు' పెట్టారని విమర్శించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామని చెబుతూనే బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం అరకొరగా చేశారన్నారు. ఈ రెండు పథకాల్లోనూ భారీగా లబ్దిదారులను కోత పెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆడబిడ్డ నిధి కింద 19 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదన్నారు. గత ఎన్నికల సమయంలో జగన్ కన్నా ఎక్కువ సంక్షేమం అందిస్తామని నమ్మించి ఓట్లేయించుకున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు చివరకు మేనిఫెస్టోలో పెట్టిన హామీలనే అమలు చేయలేని పరిస్థితికి వచ్చారని, ఇది పేదల వ్యతిరేక బడ్జెట్ అని అనంత వెంకటరామిరెడ్డి అన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com

కర్నూలు, శనివారం 1, మార్చి 2025

లెక్కలు ఫుల్ .. ఖజానా నిల్ !

- ప్రజలను మభ్యపెట్టడానికి ఈ బడ్జెట్
- బడ్జెట్‌లో రాయలసీమకు తీవ్ర అన్యాయం
- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-పుట్టపర్తి: రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కలు ఫుల్ ఖజానా నిల్ మాదిరిగా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3,22,359 కోట్ల భారీ బడ్జెట్ను ప్రతిపాదించగా అందులో రెవిన్యూలోటు 33,185 కోట్లు, ద్రవ్యలోటు 79,926 కోట్లుగా నిర్ణయించారన్నారు. ఇంత లోటును ఎలా పూడుస్తారనీ, అప్పులు చేస్తారా? ఆస్తులు అమ్ముతారా? లేక ప్రజలపై భారం మోపుతారా స్పష్టత ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో జగన్ హయాంలో 4 లక్షల 21 వేల 201 కోట్ల రూపాయలు అప్పు చేశారని బడ్జెట్లో చెప్పారన్నారు. మరిప్పుడు 7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగానికి, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యతే ఇవ్వ లేదన్నారు. సాగునీటి రంగానికి కనీసం 10 శాతం కేటాయింపులు ఉండాలన్నారు. లెక్క ప్రకారం 32 వేల కోట్లు కేటాయించాలన్నారు. సాగునీటికి కేటాయించింది కేవలం 11,314 కోట్లు మాత్రమేనని 3.5 శాతం కూడా లేదన్నారు. పోలవరం కాకుండా రాష్ట్రంలో సాగునీటికి 77,845 కోట్ల రూపాయలు కావాలనీ, ఒక్క రాయలసీమకే 40,480 కోట్లు అవసరం ఉందన్నారు. ఈ అరకొర కేటాయింపులతో కచ్చితంగా రాయలసీమకు అన్యాయం జరుగుతుం దన్నారు. ధరల స్థిరీకరణకు 4,500 కోట్లు అవసరమని, కానీ 300 కోట్లే కేటాయించారన్నారు . గిట్టుబాటు ధరల్లేక రైతులు అల్లాడుతుంటే, ఈ నిధులు సరిపోతాయా అని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ కు 10,400 కోట్లు అవసరం కాగా 6,300 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. కౌలు రైతులను విస్మరించారన్నారు.

ఉచిత బస్సును హామీని అటకెక్కించారన్నారు. ప్రతినెలా మహిళకు 1500 ఇస్తామనీ హామీ ఇచ్చారని, బడ్జెట్లోఈ ప్రస్తావించనేలేదన్నారు. ప్రతి నెలా నిరుద్యోగ భృతి 3000 ఇస్తామని హామీ ఇచ్చారని దీనిపైన స్పష్టత ఇవ్వలేదన్నారు. బీసీలకు 50 ఏళ్లు దాటితే పెన్షన్, చంద్రన్న బీమా పథకాలనూ పక్కన పెట్టేశారన్నారు. ఆటో,టాక్సీ, లారీ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇస్తామన్న హామీని పక్కన పెట్టారన్నారు. లాయర్లకు నెలకు రూ.10 వేలు, కాపు సంక్షేమానికి రూ.15 వేల కోట్లు, పెళ్లికానుక లక్ష రూపాయలు ఇస్తామని ప్రగల్భాలు పలికారన్నారు. తల్లికి వందనం, దీపం పథకాల్లోనూ భారీ కోత విధించారన్నారు.తల్లికి వందనానికి 25 వేల కోట్లు కావాలనీ,కానీ కేవలం 9,400 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారన్నారు. కోటీ 55 లక్షల మంది దీపం లబ్దిదారులను 90 లక్షలకు కుదించడమే గాక, బడ్జెట్లో 4 వేల కోట్లను కాస్త 2,601 తగ్గించేశారన్నారు. డ్వాక్రా మహిళలకు 10 లక్షల వరకూ సున్నా వడ్డీకి రుణంపై ఒక్క మాటా చెప్పలేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన మోదీని పదేపదే కీర్తించడం మరీ విడ్డూరంగా ఉందన్నారు.

పచ్చని పొలాలలో సోలారా... ఉపేక్షించం

రైతు సంఘం నాయకులు

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండల పరిధిలోని మర్రికొమ్మదిన్నె పంచాయతీలో ఏర్పాటు చేయదలచిన సోలార్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షుడు హరి పేర్కొన్నారు. శుక్రవారం రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూ మార్చి 3వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను విస్మరించిం దని పేర్కొన్నారు. రైతులకు ప్రోత్సాహకాలను అందించడం మాని కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ పచ్చని పొలాల్లో సోలార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం దారుణం అన్నారు. రోజురోజుకు వ్యవసాయం శాపంగా మారడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, వలసలు, ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయన్నారు. ముందస్తు పెట్టుబడి, రైతు భరోసా ప్రకటించాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన పంటలు పండకపోవడాన్ని అవకాశంగా తీసుకుని సోలార్ నిర్మాణానికి కార్పొరేట్ కంపెనీలైన అదాని, ఇండోసోల్‌లకు రైతుల భూములను కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తామన్నారు. రైతులకు గీతాబాటు ధరలు, సాగునీరు, మార్కెట్ సౌకర్యాలు, భూసమస్యలు, సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పగటి పూట నాణ్యమైన విద్యుత్, చుక్కల భూములతో సహా సాగులో వున్న బంజరు భూములకు పట్టాలు, సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీతో డ్రిప్, స్ప్రింకర్లు, సౌర పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగిరెడ్డి, పాల్గొన్నారు.

జిల్లాను సారా రహితంగా మార్చడమే ధ్యేయం : కలెక్టర్

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే.. నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశ్యం అని, ఆ దిశగా జిల్లాలో.. సమూలంగా నటుసారాను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోలోని కోర్టు హాలులో.. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం 'నవోదయం 2.0'పై జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. . గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాటుసారా వినియోగం వల్ల కలిగే.. ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలన్నారు. 2 నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం అమలుపై అన్ని అనుబంధ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకొని ఎమ్మార్వో అధ్యక్షతన సారా వల్ల దుష్ప్రభావాలపై సమావేశం నిర్వహించుకోవాలని తెలిపారు. నాటుసారా అమ్మటా తయారు చేయుట, రవాణా చేయుట కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని తెలపాలన్నారు.

కౌన్సిల్ తీర్మానాలు ఆమోదం.. చైర్మన్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాలపై కౌన్సిలర్లు తమ ఆమోదం తెలిపారని చైర్మన్ కాచర్ల లక్ష్మీ తెలిపారు. ఈ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఎన్ ఆర్‌జిఎఫ్ కింద చేసిన పనులకు సంబంధించిన బిల్లులు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి మంజూరు చేయాలని అజెండాలో ఉండడంతో కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి వ్యతిరేకించగా మిగిలిన కౌన్సిలర్లు కూడా అప్పట్లో చేసిన అభివృద్ధిలకు మున్సిపల్ నిధులలో ఎలా బిల్లులు మంజూరు చేస్తారని కమిషనరును ప్రశ్నించారు. దీంతో రెండు తీర్మానాలు చైర్పర్సన్ రిజెక్ట్ చేశామని ప్రకటించారు. పట్టణంలోని మున్సిపల్ ట్యాంకులను శుభ్రం చేయడం లేదని దీనివల్ల రోగాలు వచ్చే అవకాశము ఉన్నాయని పలువురు కౌన్సిలర్లు తెలియజేశారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ శుభ్రం చేసే సమయంలో కౌన్సిలర్లకు సమాచారం ఇస్తానని తెలిపారు. కదిరికేటి వద్ద ఫ్లైఓవర్ బీచ్ పనులు జరుగుతున్నాయని వన్వే ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతేకాకుండా ఇటీవలే ఒక విద్యార్థి కూడా మృతి చెందడం జరిగిందని తెలిపారు. ట్రాఫిక్ పై సంబంధిత అధికారులతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు తెలిపారు.

ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి

సిపిఐ నియోజ వర్గ కార్యదర్శి ముసుగు మధు

విశాలాంధ్ర-ధర్మవరం: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు. మేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 3 సెంట్లు నివాస స్థలము ఇస్తామని అలాగే ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తామని తెలిపిందని, తదుపరి కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నందున పేదల నివాస స్థలానికి కూటమి ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారము నివాస స్థలాలు, నిర్మించుకోవడానికి నిధులు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాట నెరవేర్చకపోతే పేదలతో కలిసి పోరాటాలు కొనసాగి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు, పోలా లక్ష్మీనారాయణ, చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బుడగ వెంకట నారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గుర్రం వెంకటస్వామి, ఏఐవైఎఫ్, జిల్లా కార్యదర్శి సకల రాజా, సిపిఐ నాయకులు శ్రీనివాసులు, రంగయ్య, ఆది, శ్రీధర్, ఈశ్వరయ్య, కొండ, ముత్యం రవీంద్ర, మహిళా సమాఖ్య తరపున లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ, అనుబంధ సంస్థలు నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు కేటాయించాలి

సీపీఐ నాయకుల డిమాండ్

విశాలాంధ్ర-కదిరి : అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి లియాకత్ అలీ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలో గాంధీ నగర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో కాలనీ వాసులతో అర్హత పత్రాల నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం చేయకుండా గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు, శోభారాణి,భవాని, షఫియా పాల్గొన్నారు.

మాట నెరవేర్చకుంటే పోరు తప్పదు

విశాలాంధ్ర-కనగానపల్లి : ఎన్నికల హామీలను గాలికి వదిలేశారా అంటూ సత్యసాయి జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహాదేవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కనగానపల్లి మండలం కనగానపల్ల గ్రామం బీసీ కాలనీలో పర్యటించారు. గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు నివాస స్థలం ఇస్తామని అలాగే ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీనిచ్చి నిర్లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నందున పేదల నివాస స్థలానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. మాట నెరవేర్చకపోతే పేదలతో కలిసి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల గోవిందు, మండల సిపిఐ కార్యదర్శి ఎం. బాలరాజు, రైతు సంఘం మండల అధ్యక్షులు పసుల నాగరాజు, కార్యదర్శి గవ్వల ప్రసాద్, ఓబుళపతి పాల్గొన్నారు.

మానవాళి అభివృద్ధికి సైన్స్ ఎంతో దోహదం

కేఎల్ఎన్ కరస్పాండెంట్ రమేష్

విశాలాంధ్ర-కదిరి : మానవాళి అభివృద్ధికి సైన్స్ ఎంతో దోహదపడుతుందని కేఎల్ఎన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ రమేష్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ రమేష్ మాట్లాడుతూ ప్రతిఏత ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు.

సర్ సివి రామన్ భారత ఖ్యాతిని నలువైపుల విస్తరించారని ఆయన సేవలను విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులు సైన్స్ కు సంబంధించిన వివిధ నమోద నమూనాలు ప్రదర్శన చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం

నేడే పరీక్షలు...

విశాలాంధ్ర-అమడగూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1వ తేది నుండి 15 వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు స్థానిక కళాశాలతో పాటు మోడల్ స్కూల్, కస్తూరిబా స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం 186, ద్వితీయ సంవత్సరం 117 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడం తో పాటు సిసి కెమెరాలను, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట లోపే చేరుకోవాలని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు ఎవరూ ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు.

ఫ్రీకాట్ 'బి' మిల్లును మూతపడకుండా కాపాడండి

విశాలాంధ్ర-హిందూపురం : పరిగి మండలం కోడిగేనహళ్లి పంచాయితీలో ఉన్న ఫ్రికాట్ 'బి' మిల్లు మూతపడకుండా కాపాడాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు వేమయ్య యాదవ్, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ కలెక్టర్ చేతన్‌ను ఏఐటియుసి నాయకులతో కలసి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి కోరారు. వారు మాట్లాడుతూ ఈ మిల్లు 1983లో ఏర్పడిన ఫ్రికాట్ 'బి' మిల్ చరిత్ర ఎంతో ఘనమైనదని, ఎందరో కార్మికుల కుటుంబాల్ని పెంచి, పోషించి ఉన్నతమైన స్థానంలో నిలబెట్టిన చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు పని నిలిపివేయటం ఫ్యాక్టరీ రన్ అవుట్ చేయటం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తున్నదన్నారు. కుటుంబాల భవిష్యత్తును మానవతా దృక్పథంతో దృష్టిలో ఉంచుకొని ఫ్యాక్టరీ యథావిధిగా కొనసాగేలా ప్రభుత్వం తరఫున చర్యలు చేపట్టాలని కోరారు. పరిశ్రమ మూతపడకుండా ప్రభుత్వం తరఫున చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి డి. బాబు, మిల్లు ప్రధాన కార్యదర్శి మారుతిరెడ్డి పాల్గొన్నారు.

మానవ సేవను అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరం : మానవసేవను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సత్య సాయి సేవ సమితి కన్వీనర్ నామ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 380 మందికి రోగులకు, వారి సహాయకులకు భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్లను ఆసుపత్రి వైద్యులు, సిస్టర్ల చేతులు మీదుగా అందజేశారు. తదుపరి గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకంగా స్వీట్లు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సేవాదాతగా కీర్తిశేషులు చింత ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ మాధవి మాట్లాడుతూ సత్యసాయి సేవ సమితి సేవను కొనియాడారు.

విద్యారంగ బడ్జెట్లో నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-ధర్మవరం : విద్యారంగ బలోపేతానికి బడ్జెట్లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్ర రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ కొఠారి కమిషన్ చెప్పిన దానిని పట్టించుకోకుండా, రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంకు ప్రవేశపెట్టిన బడ్జెట్లో పాఠశాల విద్యాశాఖకు 9.86 శాతము మాత్రమే నిధులను కేటాయించడం పట్ల, 12వ పిఆర్సి కోసం ,ఆర్థిక బకాయిల చెల్లింపుల కోసం నిధులు లేకపోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా తక్కువ కేటాయింపులు చేయటం వల్ల ప్రభుత్వ విద్యారంగబాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలగుతున్నదనే భావన ఏర్పడుతున్నదని పేర్కొన్నారు. శాసనసభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి 31,805 కోట్లు నిధులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఏమాత్రం సరిపోవని అభిప్రాయపడ్డారు. 12వ పిఆర్సి, ఆర్థిక బకాయిలు చెల్లింపు ఊసు కూడా లేకపోవడం పట ఆగ్రహం వ్యక్తం చేశారు.

సెహరీ, ఇఫ్తార్ చార్ట్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ధర్మవరం : స్థానిక కోటలో ఉన్న మద్రస-ఏ-కాషిఫుల్ ఉలూమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరం , నియోజకవర్గ గ్రామాల ప్రజల కోసం 2025 రమజాన్ సెహరీ ,ఇఫ్తార్ సమయాన్ని తెలిపే చార్ట్‌ను శుక్రవారం ముస్లిం ప్రముఖులు మదీనా మజీద్ ముత్తువల్లి జనాబ్ నాగూర్ హుస్సేన్ , జనాబ్ అబ్దుల్ రవూఫ్ ముత్తువల్లి మస్జిద్- ఏ-ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ మారుతి నగర్, జనాబ్ ముఖ్తార్ మాజీ జనరల్ సెక్రెటరీ మస్జిద్-ఏ- ఖాదిరియ దర్గా నగర్ ఇమామ్ సాహబ్ మస్జిద్-ఏ-ఖాదిరియ, చేతులు మీదుగా మద్రస-ఏ-కాషిఫుల్ ఉలూమ్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఉమర్ ఫారూఖ్ విడుదల చేశారు. కలిసిమెలిసి సుఖ సంతోషాలతో రమజాన్ నెల గడపాలని ఆకాంక్షించారు.

మానవాళి అన్ని సమస్యలకు పరిష్కారం చూపేది సైన్సే..

విశాలాంధ్ర-ధర్మవరం : మానవాళి అన్ని సమస్యలకు పరిష్కారం చూపేది సైన్సే అని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ విక్రాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సూర్య స్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరేంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మానవ వికాసం సైన్సుతోనే సాధ్యమయిందన్నారు. ఇదంతా పరిశీలన, స్వీయ రక్షణ, అనుభవాల సమ్మిళితంగా కొనసాగిందన్నారు. ప్రతీ పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్నీ కలిగి ఉండాలని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ " రామన్ ప్రభావం " అనే దృగ్విషయం కనుగొన్నం దుకు గుర్తుగా భారత ప్రభుత్వం జాతీయ సైన్సు డే ను ప్రకటించిం దన్నారు. తదుపరి డాక్టర్ ఆదిశేషు చేసిన మ్యాజిక్ విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సూర్య స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర బాబు, జెవివి లోకేష్,ఉపాధ్యాయులు ప్రభావతి, జాహ్నవి, శీనా, శ్యామల, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి, చింత చెట్లకు నిప్పు

విశాలాంధ్ర-గుడిబండ: మండలం పరిధిలోని యస్.రాయపురా గ్రామానికి చెందిన రైతు నాగేంద్రప్పకు చెందిన మామిడి, చింత చెట్లుకు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. సర్వే నంబర్ 72-2 లో 6 ఎకరాల 72 సెంట్లు 272-1ఎ. లో 0.94 సెంట్లు 272-2ఎ ఒక ఎకరా 52 సెంట్లు 272-3ఎ 42 సెంట్లు గల భూమిలో 250 మామిడి మరియు చింత మూడు వందల చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హార్టికల్చర్ అసిస్టెంట్ సంధ్యారాణి పూర్తిగా కాలిపోయిన మామిడి చింత చెట్లను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని చెప్పినట్లు ఆయన తెలిపారు. రూ.3 లక్షల వరకు తనకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వ ఉన్నత అధికారులు ఆదుకోవాలని కోరారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ

విశాలాంధ్ర-అగళి : జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిణి హేమలత రెండవ స్థానంలో నిలిచింది. జాతీయ సైన్స్ డే దినోత్సవ సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన "వికసిత్ భారత్ కోసం సైన్స్"ఎస్సే రైటింగ్‌లో 9వ తరగతి చదువుతున్న హేమలత జిల్లా స్థాయిలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకుని డీఈఓ క్రిష్టప్ప చేతుల మీదుగా అవార్డును అందుకుంది. ఇందుకు సహకరించిన సైన్స్ ఉపాధ్యాయులు నాగేంద్ర కుమార్, టెక్నికల్గా సహకరించిన హిందీ పండిట్, ఉపాధ్యాయులు షబ్బీర్, పాఠశాల తరపున హెచ్ఎం వరదరాజులు, ఎమ్ఇఓలు భాస్కర్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

వశిష్ఠ పాఠశాలలో ఘనంగా సైన్స్ డే

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ డే ఎంతో దోహదపడుతుందని ఎంఈఓ సురేష్, వశిష్ఠ కరస్పాండెంట్ పిట్టా శివ శంకర్ రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వశిష్ఠ ఆంగ్ల మిడియం పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రాజెక్టు వర్క్ ప్రతిమలతో పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేశారు. సైన్స్ డే ప్రాధాన్యత గురించి ఎంఈఓ సురేష్, వశిష్ఠ పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివ శంకర్ రెడ్డి లు విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పవన్ కుమార్ , గౌరిశంకర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి ప్రాజెక్ట్ వర్క్స్ స్టాల్స్ పరిశీలించారు.

భిక్షాటన చేస్తున్న తల్లుల పట్టివేత

విశాలాంధ్ర-కదిరి: పట్టణంలో రద్దీ ప్రాంతాలలో చంటి పిల్లల సహాయంతో భిక్షాటన చేస్తున్న తల్లులను పట్టుకొని పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పట్టణ సీఐ డివి నారాయణ రెడ్డి తెలిపారు. కౌన్సిలింగ్ అనంతరం సమతా స్వచ్ఛంద సంస్థకు అప్పగించామని, సంస్థ ద్వారా పునరావాసం ఏర్పాటు చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికి తీయడానికే విజ్ఞాన ప్రదర్శన.

విశాలాంధ్ర-రొళ్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి విజ్ఞాన ప్రదర్శన ఎంతో గానో ఉపయోగపడుతుందని కెనరా బ్యాంక్ మేనేజర్ నాగరాజు,రొళ్ల బ్రాంచ్ పోస్టల్ ఆఫీసర్ శ్రీమతి అరుణ పేర్కొన్నారు.మండల కేంద్రంలోని స్థానిక శ్రీ బాలాజీ అప్పర్ ప్రైమరీ పాఠశాల నందు శుక్రవారం శ్రీబాలాజీ అప్పర్ ప్రైమరీ పాఠశాల కరస్పాండెంట్ శశికుమార్ వారి ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా విజ్ఞాన ప్రదర్శనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దాదాపు 80 సైన్స్ నమూనాలను ప్రదర్శించారు ఎల్.కే.జి నుండి 7వ తరగతి విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను పెద్ద సంఖ్యలో ప్రదర్శించారు థర్డ్ హెూలో గ్రామ్,సోలార్ ఎనర్జీ ఆర్గానిక్ ఫార్మింగ్,జూ,ఎర్లీ హ్యూమన్ లైఫ్ ఫండమెంటల్ రైట్స్ మొదలైన సైన్స్ ప్రాజెక్టుల నమూనాలను ఉంచారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అలాగే మురళి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు,శ్రీ లక్ష్మీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి నమూనాలను వీక్షించి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.వారు మాట్లాడుతూ సైన్స్ అనేది ఒక శాస్త్రీయ విద్య అని జీవితాన్ని సుఖమయం చేయడానికి వ్యవసాయం ఆరోగ్యం వంటి రంగాల్లో పురోగతిని సాధించడానికి సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా కో-ఆర్డినేటర్ రామకృష్ణ,వైస్ సర్పంచ్ దొమ్మరహట్టి రవికుమార్, సర్పంచ్ తనయుడు రవి,ప్రధానోపాధ్యాయురాలు శృతి, ఉపాధ్యాయులు భీమనాయక్,నాగరాజ్ నవీన్,కావ్య,రష్మీ,ఛాయా పాల్గొన్నారు..

యల్ ఆర్‌జీ విద్యాలయంలో సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని క్రికెట్ పంచాయతీలో గల ఎల్ ఆర్ జి విద్యాలయం నందు శుక్రవారం జన విజ్ఞాన వేదిక సభ్యులు ఈటీ. రామమూర్తి, రామకృష్ణ, చైతన్య గంగిరెడ్డి, ఉగ్రప్ప ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, సైన్స్ అభివృద్ధికి శాస్త్రజ్ఞుల కృషిని విద్యార్థులకు వివరించారు. ప్రజలలో సైన్స్ పట్ల అవగాహన పెంచి, మూఢనమ్మకాలను పోగొట్టాలనే తాపత్రయంలో తమ ప్రాణాలను సైతం కోల్పోయారని, విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన, పరిశీలన, పరిశోధన తత్వం పెంచుకోవాలని, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణ సైన్సుకు మూఢనమ్మకాలకు గల వ్యత్యాసాలను ఉదాహరణలు, కృత్యముల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైన్స్ పాఠాలను తమ దైనందిక జీవితంలో అన్వయించుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఈ. ప్రసాద్ సూచించారు.

మామిడి పంట రైతులకు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర- నల్లమాడ: మండలంలో ఏపీ మాస్ సంస్థ వారి కలెక్షన్ సెంటర్ నందు శుక్రవారం మామిడి పంటల రైతులకు యాజమాన్య చర్యలు ఎగుమతిల పై శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఏరువాక కేంద్రం అధికారి రామసుబ్బయ్య, ఉద్యాన అధికారి నవీన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మామిడి పంటకు ఫ్రూట్ కవర్స్ ఎంతో మేలు చేస్తాయని పురుగు తెగుల మందును, పోషక యాజమాన్యం పచ్చి రొట్టె ఎరువులు అవశ్యకత గురించి వివరించారు. బెంగళూరు నుంచి ఎగుమతి దారులైన అగ్రి పార్క్ ఇన్నోవా బయో లిమిటెడ్ వారు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా మామిడి పంటకు ఎగుమతిలో విశిష్టమైన ప్రాముఖ్యత ఉన్నదని.. ఈ రైతు సంఘంతో ఒక అవగాహన ఒప్పందానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎఫ్ పీఓ అధ్యక్షులు నాగేష్, సీఈఓ నర్సింహులు, రాజశేఖరరెడ్డి, సుందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ డే కార్యక్రమాలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని లయోలా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో సైన్స్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహిచామని కరెస్పాండెంట్ శంకర్ నాయుడు తెలిపారు. పదుల సంఖ్యలో సైన్స్ డే ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ గోపాల్ నాయక్, డాక్టర్ సుబ్బారావు, వన్ టౌన్ ఎస్ఐ కేతన్ విచ్చేసి సైన్స్ డే కార్యక్రమాల పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. సివి రామన్ గురించి విద్యార్థులకు వివరించారు. పిల్లల మనసు నిత్యం ప్రయోగాలకు, వారి బుద్ధి వికాసానికి ఇది చాలా ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ సైన్స్ డే లో మొదటి బహుమతిగా వాటర్ లెవెల్ డిటెక్టర్ 9వ తరగతి విద్యార్థులను ఎంపిక కాగా, రెండవ బహుమతిగా స్టేట్స్ వాటి క్యాపిటల్ ఎనిమిదవ తరగతి విద్యార్థులు, మూడవ బహుమతిగా రెస్పిరేటరీ సిస్టం 9వ తరగతి విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. అదేవిధంగా సర్టిఫికెట్లను కూడా విద్యార్థులకు అందజేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-అమరాపురం: మండల పరిధిలోని ఉదుగురు గ్రామ హేమావతి రోడ్డులో ఉన్న ఓవర్ ట్యాంక్ సమీపంలో ఇదే మండలానికి చెందిన వీ అగ్రహారం గ్రామవాసి జగదీష్ (50) హేమావతి బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో మినరల్ వాటర్ సప్లై ఆటో అతివేగంగా అజాగ్రత్తగా ఢీకొంది. ద్విచక్ర వాహన దారుడు మృతిచెందినట్లు ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

విశాలాంధ్ర-పెనుకొండ : సివిల్ సప్లయిస్ హమాలీలకు పెరిగిన కూలి రేట్లు, 14 నెలల ఎరియర్స్ చెల్లింపుకు వెంటనే జీఓలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు, మార్చి 7 విజయ వాడ ఎండి ఆఫీసు వద్ద ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పౌరసరఫరాల హమాలీల యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. గత నవంబర్ 20వ తేదీ కూలి రేట్లు క్వింటాల్‌కి రూ.25 నుండి 28 రూపాయలకు పెంచేందుకు ప్రభుత్వానికి హమాలీ కార్మిక సంఘాల మధ్య ఒప్పందం జరిగినా నేటికీ జీఓ జారీ చేయకుండా కాలయాపన చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లైస్ కూలి రేట్లు జీఓ విడుదల చేయాలన్నారు. పెరిగిన కూలి రేట్లు 2024 జనవరి నుండి 14 నెలల ఎరియర్స్ చెల్లింపుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. దసరా బోనస్, స్వీట్, యూనిఫాం, టిచ్చింగ్ ఛార్జ్, స్వీపర్ వేతనాల పెంపు చేయాలని కోరారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 01, మార్చి 2025

జీఎస్ తండాలో నాటుసారా నిర్మూలన

విశాలాంధ్ర-గుడిబండ: మండలం పరిధిలోని గుడ్డదహళ్లి తండా గ్రామంలో ఎక్సైంజ్ శాఖ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్ శంకర్ పర్యటించారు. ఈ క్రమంలో సర్పంచ్ సతీష్ బాబు, పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రకాష్, వీఆర్వో రామప్ప, లు పాల్గొని వారు మాట్లాడుతూ నాటు సారాయి అమ్ముట తయారు చేయుట నాటుసారా రవాణా చేయుట కలిగివుండుట చట్టరీత్యా నేరం గనుక ఈ నేరం చేసిన వారికి 8 సంవత్సరాలు జైలు శిక్షతోపాటు ఐదు లక్షల రూపాయల వరకు జరిమానా విధించబడుతుంది అని తెలిపారు. ఈ క్రమంలో ఎక్సైంజ్ అధికారులు మాట్లాడుతూ నాటు తయారీ చేసే వ్యక్తులు ఊరికి దూరంగా మురికికుంటల దగ్గర ఉన్న నీటితో పనికిరాని నల్లబెల్లం, పరిచెత్త, పాతచెప్పులు, బ్యాటరీ లోని నల్లని కార్బనం, యూరియాను అనేక విషపూరిత రసాయనాలు కలిపి నాటుసారా ను తయారు చేస్తుంటారు. తయారు చేసే వ్యక్తుల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు అలాగే గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ నగర్ అభివృద్ధికి చర్యలు చేపడతాం : కలెక్టర్

విశాలాంధ్ర - శింగనమల : మండల పరిధిలోని ట్రాక్టర్ నగర్ ను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ శుక్రవారంసమగ్రంగా పరిశీలించారు. ట్రాక్టర్ నగర్ అభివృద్ధికి చర్యలు చేపడతామని, ఇందుకు జిల్లా యంత్రాంగం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. శుక్రవారం శింగనమల మండల పరిధిలోగల దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ మరియు పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా ట్రాక్టర్ నగర్ లో కంట్రోల్ రూమ్, టెస్ట్ ల్యాబ్, పరీక్షణ కేంద్రం, వాల్యూ ఎడిషన్ ల్యాబ్, ప్రాసెసింగ్ ల్యాబ్, పవర్ పిల్లర్ ల్యాబ్, జనరల్ ఫ్రెండ్లీ ఎక్విప్మెంట్ ల్యాబ్, ఇంజన్ కట్ సెక్షన్ ల్యాబ్, తదితర విభాగాలను, ఫారంపాండ్ లను జిల్లా కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ కోర్సులు పూర్తిచేసిన అనంతరం ఎలాంటి ఉద్యోగాలకు వెళ్లొచ్చు, మీరు ఏం చేద్దాం అనుకుంటున్నారు. ప్లేస్మెంట్ ఎక్కడ ఉంటుంది, రిక్రూట్మెంట్ వివరాలను ఆరా తీసి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ డిడి నరసింహారావు, దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ మరియు పరీక్షణ సంస్థ సీనియర్ అగ్రికల్చర్ ఇంజనీర్ విజయ్ కుమార్ బదియ, ట్రైనింగ్ హెడ్ జయంత్, ఏడిఏ రవికుమార్, శింగనమల తహసిల్దార్ బ్రహ్మయ్య వ్యవసాయాధికారులు బాల నాయక్, సోమశేఖర్, దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ మరియు పరీక్షణ సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళలు ధర్నా

విశాలాంధ్ర-పుట్టపర్తి: పుట్టపర్తి మున్సిపాలిటీలోని 2, 3, 4 వార్డుల లోని మహిళలు మున్సిపల్ కార్యాలయం వద్ద తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 3 నెలల నుంచి వార్డులలో మోటర్లు చెడిపోవడంతో పది రోజులకు ఒకసారి తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదని చేసేదిలేక మున్సిపల్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ వార్డులోనే త్రాగునీరు సమస్య ఏర్పడితే తాము ఎవరికి చెప్పుకోవాలని కమిషనర్ ముందు మహిళలు వాపోయారు. అనంతరం కమిషనర్ ప్రహల్లాద, చైర్మన్ తుంగ ఓబుళపతి, రెండో వార్డ్ కౌన్సిలర్ చెరువు భాస్కర్ రెడ్డి రెండవ వార్డులో పర్యటించగా అక్కడ ఉన్న మహిళలు వారిని అడ్డగించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాటర్ మెన్ సరిగా పనిచేయడం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆయనను మార్చాలని కోరారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా అమ్మవారి చండీహెూమం

విశాలాంధ్ర-లేపాక్షి : మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో శనివారం మధ్యాహ్నం దుర్గాదేవి అమ్మవారికి చండి హెూమమును ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పర్యవేక్షణలో వేదపండితులు సునీల్ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు నిర్వహించారు. రాక్షసులను సంహరించడానికి దుర్గాదేవి చండి అవతారంలో అవతరించి చండియాగంలో వారిని సంహరిస్తుందని ఆగమీకులు తెలిపారు. ఈ చండియాగం చేయడం వలన గ్రామాభివృద్ధికి, కరువు కాటకాల నివారించి మంచి జరుగుతుందని తెలిపారు. వేదపండితులు హెూమాలను నిర్వహించి అమ్మవారిని ఆలయం చుట్టు ప్రదిక్షణ చేసారు. అనంతరం శివపార్వతులను సింహవాహనోత్సంలో ఊరేగించారు. అభిషేకార్చనలు. మహా పూర్ణాహుతి హెూమము, పార్వటోత్సవం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప లలితమ్మ దంపతులు హెూమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ అంజన్ రెడ్డి మాజీ ఎంపీపీ ఆనంద్ అన్నదాన కమిటీ సభ్యులు గ్రామపెద్దలు. భక్తులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగం

విశాలాంధ్ర-ధర్మవరం: విద్యార్థులకు విజ్ఞానం సైన్స్ ప్రదర్శన వల్ల ఎంతగానో ఉపయోగపడతాయని కరెస్పాండెంట్ సీతాపతి రావు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాధన ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సైన్స్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథిగా శంకర్ నాయుడు విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన గావించి, సైన్స్ డే ప్రదర్శనను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తదుపరి విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాలైన విజ్ఞాన శాస్త్ర నమూనాలను చూసి సైన్స్ డే గురించి వారు పలు విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ ప్రదర్శనలో ప్రతిభా ఘనపరిచిన వారికి బహుమతి ప్రదానాన్ని పంపిణీ చేశారు. అనంతరం సీతాపతి రావు, శంకర్ నాయుడు మాట్లాడుతూ చదువుతోపాటు జనరల్ నాలెడ్జ్ కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని, తీరితోపాటు ప్రాక్టికల్ కూడా ప్రాధాన్యత చాటుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు భువనేశ్వరి దేవి, వాసవి, కుళ్లాయమ్మ, సాజిదా, మంజుల దేవి, శైలజ, లక్ష్మీనారాయణ ,సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ డే

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని లయోలా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో సైన్స్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగిందని కరెస్పాండెంట్ శంకర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదుల సంఖ్యలో సైన్స్ డే ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ గోపాల్ నాయక్, డాక్టర్ సుబ్బారావు, వన్ టౌన్ ఎస్ఐ కేతన్ విచ్చేసి సైన్స్ డే కార్యక్రమాల పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. తదుపరివారు సివి రామన్ గూర్చి విద్యార్థులకు వివరించారు. తదుపరి ప్రతిభ కనపరిచిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లల మనసు నిత్యం ప్రయోగాలకు, వారి బుద్ధి వికాసానికి ఇది చాలా ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ సైన్స్‌డేలో మొదటి బహుమతిగా వాటర్ లెవెల్ డిటెక్టర్ 9వ తరగతి విద్యార్థులను ఎంపిక కాగా, రెండవ బహుమతిగా స్టేట్స్ వాటి క్యాపిటల్ ఎనిమిదవ తరగతి విద్యార్థులు, మూడవ బహుమతిగా రెస్పిరేటరీ సిస్టం 9వ తరగతి విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. అదేవిధంగా సర్టిఫికెట్లను కూడా విద్యార్థులకు అందజేశారు.

పరీక్షల కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్రవ్యాప్తంగా రేపటినుండి ఇంటర్ ప్రథమ ద్వితీయ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరుగునున్నాయి అందులో భాగంగానే ధర్మవరం పట్టణంలో పరీక్షలు రాసే ఇంటర్ విద్యార్థులకు పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆర్డిఓ మహేష్ కువినతిపత్రం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానంగా వేసవికాలం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు తాగునీరు , మజ్జిగ ప్యాకెట్లు ఏర్పాట్లు చేయాలని, వైకల్యంతో ఉన్న విద్యార్థులకు పరీక్ష రాసే తోడ్పాటును ఏర్పాట్లు చేయాలని , పరీక్ష కేంద్రాల్లో దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని తదితర సౌకర్యాలు విద్యార్థులకు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అనిల్ ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్, పట్టణ ఉపాధ్యక్షులు అమన్, నాయకులు సిద్ధిక్ పాల్గొన్నారు.

చిట్టి బుర్రలకు పెద్ద ఆలోచనలు..

విశాలాంధ్ర - ఉరవకొండ : చిట్టి బుర్రలకు పదును పెట్టారు. అద్భుతమైన ఆవిష్కరణలు రూపొందించి అబ్బుర పరిచారు. స్థానిక శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. గణిత, కమ్యూనికేషన్ టెక్నాలజీ, సమాచార కమ్యూనికేషన్ టెక్నాలజీ పురోగతి, పర్యావరణ హితమైన పద్ధతులు, ఆరోగ్య పరిశుభ్రత, రవాణా తదితర అంశాలలో రూపొందించిన నమూనాలు ప్రదర్శనలో ఉంచారు. సైన్స్ ఫెయిర్‌ను పాఠశాల కరస్పాండెంట్ రఘురాములు, ప్రధానోపాధ్యా యురాలు శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫేర్ ఎంతో దోహదపడు తుందన్నారు. శాస్త్రీయ అభివృద్ధితోనే మానవ జీవనప్రమాణాలు మెరుగుపడి ఉన్నాయన్నారు. భావితరాలకు ఉపయోగపడే ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవిత,మహేష్, సురేంద్ర, మరియు సిబ్బంది అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శుభవార్త

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గ నిరుద్యోగులకు శుభవార్త తెలిపారు రాష్ట్ర బీసీ , ఈడబ్ల్యూఎస్ సంక్షేమం చేనేత, జౌళి శాఖల మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ - మెగా జాబ్ మేళా మార్చి 02 వ తేదీ, 2025, ఆదివారంఉ.9:00 గం.ల నుండి సా.4:00 గం.ల వరకు వేదిక : మంత్రిగారి క్యాంపు కార్యాలయం, టీడీపీ పార్టీ కార్యాలయం, మడకశిర రోడ్డు, పెనుకొండ నందు ఉంటుంది కావున నిరుద్యోగులు ఈ సదా అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి గారి కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

దేశంలోనే అనంత పోలీసులు అగ్రస్థానం

విశాలాంధ్ర అనంతపురం క్రైం: ఇక దొరకవని ఆశలు వదలిన సెల్ ఫోన్లను పోలీసుల ద్వారా అందుకున్న బాధితుల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో ప్రజల మొబైల్ ఫోన్లు చోరీకు గురై ఇతర రాష్ట్రాలకు చేరినా రికవరీలో రాజీపడకుండా స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో సెల్ఫోన్ల్లో వితరణ మేళా నిర్వహించారు. ఇప్పటి వరకు అందజేసిన మొత్తం 11,378 మొబైల్ ఫోన్‌లో అనంతపురం జిల్లా వాసులకు-7512, శ్రీ సత్యసాయి -1120 జిల్లాలతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. కాకుండా దేశంలోనే ఇతర రాష్ట్రాల్లో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫోన్లను కూడా జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకోవడం శుభపరిణామమని జిల్లా వాసులు జిల్లా ఎస్పీ నీ అభినందిస్తున్నారు. సెల్ ఫోన్ లను బాధితులకు అందజేసిన అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ సెల్ ఫోన్ దుకాణం నిర్వాహకులైనా, వ్యక్తులైనా ఎవరైనా సరే అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయొద్దని ఎస్పీ సూచించారు. సెల్ఫోన్ అమ్మేవారు పరిచయస్తులైనా సరే బిల్లులు, సంబంధిత మొబైల్ ఫోన్ వివరాలు కల్గిన బాక్సు ఉంటేనే కొనండి కొనాలని అన్నారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, తదితర ప్రదేశాలలో మోసపు మాటలతో నమ్మబలికే వారి పట్ల ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అపరిచితులతో ఫోన్ కొనడం వల్ల ఇటు సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు అటు కొన్న వ్యక్తి కూడా నష్టపోతాడని గుర్తించి దూరంగా ఉండాలి అన్నారు.ఫోన్ చోరీకి గురైనా మిస్ అయినా చాట్ బాట్ లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సి.ఇ.ఐ.ఆర్ ద్వారా నమోదు చేసుకోవాలనీ అన్నారు. సి.ఇ.ఐ.ఆర్ లో ఎలా నమోదు చేసుకోవచ్చో చాట్ బాట్ లో సూచనలు కూడా చేశాం. వెంటనే సిమ్, ఐ.యం.ఈ నంబర్లను బ్లాక్ చేస్తారు. దీనివల్ల సదరు మొబైల్ నంబర్ , మొబైల్ ఫోన్ లో ఉన్న విలువైన సమాచారం దుర్వినియోగం కాకుండా ఉండే వీలుంటుందనీ అన్నారు.ప్రజలు పోగొట్టుకున్న సెల్ ఫోన్లు జవాబుదారీగా అందించేందుకు కృషి చేసిన జిల్లా పోలీస్ సైబర్ విభాగం సి.ఐ షేక్ జాకీర్, సిబ్బంది నీ జిల్లా ఎస్పీ అభినందించారు.

రాష్ట్ర ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వమే

విశాలాంధ్ర -అనంతపురం అర్బన్ : ప్రజల్ని మధ్యలోనే డ్రాప్ అవుట్ చేసి తమ స్వార్థం చూసుకునే పార్టీ వైసీపీ మాత్రమేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 3లక్షల 22 వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తూ ఈ బడ్జెట్ ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల హామీలు అమలు దిశగా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఇన్ని రోజులు సూపర్ సిక్స్ ఎక్కడ అని విమర్శలు చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తూనే.. పరిశ్రమలు ఇతర వాటికి బడ్జెట్లో నిధులు కేటాయించారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. గత ఐదేళ్లలో ఆర్థిక వ్యవస్థ రాష్ట్రంలో చిన్న భిన్నమైందని..దీనిని సరిచేస్తూ రాష్ట్రాన్ని పునర్మించేలా బడ్జెట్ ఉందని ఆయన వ్యాఖ్యానించారు. పేద మధ్యతరగతి వర్గాల ఆకాంక్షకు అనుగుణంగా నిధుల కేటాయింపులు జరిగాయన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, రైతులు, మహిళల కు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఈ బడ్జెట్ ఉందన్నారు. అన్నదాత సుఖీభవ తో పాటు అమ్మకు వందనంకు నిధులు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్య, వైద్యానికి కూడా తగిన ప్రాధాన్యమిచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీసీ సంక్షేమానికి ఏకంగా 47 వేల కోట్ల 456 కోట్లు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి బీసీల పక్షపాతిగా ఉందని అందుకనుగుణంగానే బడ్జెట్లో కేటాయింపులు ఉన్నాయని అన్నారు. పట్టణాభివృద్ధికి 13వేల 862 కోట్లు కేటాయించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్లకు కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని..అసలైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చే దిశగా బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని కకిరీకెర పంచాయతీ నందు గల ఎల్ ఆర్ జి విద్యాలయం నందు శుక్రవారం జన విజ్ఞాన వేదిక సభ్యులు ఈ టీ.రామమూర్తి, రామకృష్ణ, చైతన్య గంగిరెడ్డి, ఉగ్రప్ప ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధికి శాస్త్రజ్ఞుల కృషిని విద్యార్థులకు వివరించారు. ప్రజలలో సైన్స్ పట్ల అవగాహన పెంచి, మూఢనమ్మకాలను పోగొట్టాలనే తాపత్రయంలో తమ ప్రాణాలను సైతం కోల్పోయారని, విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన, పరిశీలన, పరిశోధన తత్వం పెంచుకోవాలని, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణ సైన్సు కు మూఢనమ్మకాలకు గల వ్యత్యాసా లను ఉదాహరణలు, కృత్యముల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదివే పుస్తకాలలో గల సైన్స్ పాఠాలను తమ దైనందిక జీవితంలో అన్వయించుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఈ. ప్రసాద్ సూచించారు.

చైతన్య పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువులోని శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ కార్యాలయం ఏ.డి.లాజర్, విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో విద్యార్థులకు సైన్స్ ఎంతో ముఖ్యమని భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ సైన్స్ లో రాణించాలని, విద్యార్థులందరూ సర్ సివి రామన్ ఉన్నత ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, పేర్కొన్నారు, విద్యార్థులు తయారుచేసిన పలు సైన్స్ నమూనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ , డీన్ హనుమంతు, ఏవో కేశవరెడ్డి, ప్రైమరీ కోఆర్డినేటర్ అనిత, ప్రైమరీ ఇంచార్జ్ భార్గవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంతటి వారైనా ఉపేక్షించం : డీఎస్పీ

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలం సంకేపల్లి వద్ద జరిగిన ఇరువర్గాల మధ్య గొడవలు నేపథ్యంలో స్టేషన్ వద్దకు అల్లరి మూకలు చేరడంతో, ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్ తోటి సిబ్బంది శుక్రవారం మండల కేంద్రంలోపెట్రోలింగ్ నిర్వహించారు. అదేవిధంగా 144 సెక్షన్ విధించినట్లు ఆయన తెలిపారు, శాంతిభద్రతలకు విఘా తం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - బొమ్మనహాళ్ : మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థునులు పలు రకాల సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. చెత్త నుండి సంపద తయారు చేయడం, 3డీ మోడల్ వాటర్ డిస్పెన్సర్ వాటర్ నమూనలు తయారు చేసారు. శాస్త్రవేత్తల జీవిత విశేషాలను సైన్ టీచర్లు తెలియజేసారు. సైన్ పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజయం సాధించిన విద్యార్థునులకు ప్రిన్సిపల్ కమలమ్మ బహుమతులు అందించారు.

మానవాళి మనుగడకు సైన్సు దోహదపడుతుంది

విశాలాంధ్ర-కదిరి టౌన్: మున్సిపా లిటీ పరిధిలోని బ్లూ మూన్ ఇంటర్నే షనల్ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు సైన్స్ కు సంబంధించిన వివిధ నమూనాలు ప్రదర్శించారు. ఇందులో మట్టిలో విద్యుత్ ఉత్పాదకత, ఆటోమెటిక్ రైల్వే సిగ్నల్, గ్లోబల్ వార్మింగ్, చంద్రయాన్ 3, మైక్రో ఇరిగేషన్ సిస్టం మొదలగు మోడల్స్ ఎగ్జిబిషన్లను నిర్వహించారు. విద్యార్థులు చేసిన సైన్స్ నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత ఎం శివశంకర్ అభినందించారు. మానవాళికి సైన్స్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, ఇన్చార్జ్ మాధవరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ వృద్ధునికి సాయం

విశాలాంధ్ర-అమడగూరు: మండల పరిధిలోని శ్రీ మాతృశ్రీ అనాథ ఆశ్రమం నందు మానసికంగా నడవలేక నిస్సహాయ స్థితిలో ఉన్న బాబయ్య కి ఆశ్రమ నిర్వాహకురాలు అరుణ జ్యోతి బాధితుడిని వీడియో ద్వారా చిత్రీకరించి వాట్సప్, ఫేస్బుక్ ల ద్వారా బాధితుకి ఎవరైనా దాతలు స్పందించి వీల్ చైర్లను అందివ్వడానికి దాతలు ముందుకు రావాలని కోరగా ఖిద్మత్ ఏ ఖిల్క్ చారిటబుల్ ట్రస్ట్ షామీర్, అలీ, షేకింగ్ బాబ చేతుల మీదుగా నయాజ్ చేతుల మీదుగా వారికి అందించడం జరిగిందన్నారు. దాతలకు వృద్ధాశ్రమం తరఫున కృతజ్ఞతలను తెలియజేశారు.

ఘనంగా జ్యోతులు ఉత్సవాలు

విశాలాంధ్ర - అగళి : మండల పరిధిలోని కరీదాసనపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ మారమ్మ దేవి అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మారమ్మ దేవి అమ్మవారి మూల విరాట్ కు వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరించి, సాంప్రదాయం ఉట్టిపడేలా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉపవాస దీక్షలతో బియ్యం పిండి బెల్లంతో చేసిన చలివిడిని జ్యోతులుగా చేసి ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి జ్యోతులను అర్పించారు. అలాగే తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. జ్యోతుల ఉత్సవ వేడుకల సమారంభం కార్యక్రమంలో భక్తాదులు పాల్గొని అమ్మవారికి పూజలు గావించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తాదులకు తీర్థప్రసాదాలు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

చైర్మన్ సన్మానించిన యువ నాయకులు

విశాలాంధ్ర-లేపాక్షి : మహాశివరాత్రి ఉత్సవాలను ఎన్నో లక్షల రూపాయల సొంత నిధులు ఖర్చు చేసి అన్ని విధాల ఉత్సవాలను విజయవంతం చేసిన ఆలయ చైర్మన్ కరణం రమ నందన్ ను లేపాక్షి యువ నాయకులు ఘనంగా సన్మానించే అభినందనలు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం టిడిపి యువ నాయకుడు బుల్లెట్ రవి బిజెపి నాయకుడు అంజి దేవాలయావరణంలో చైర్మన్ ను పూలమాలలు సెలవలతో ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ వారిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మూర్తి తిప్పిరెడ్డి అనిల్ వెంకటేష్ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇంటికి దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - యాడికి : యాడికి మండలంలో సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారు ప్రభుత్వ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలని యాడికి టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తు ఫారం ఆధార్ కార్డు లబ్ధిదారుని బ్యాంక్ అకౌంట్ తదితర పత్రాలను తీసుకొని సంబంధిత సచివాలయం లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ కు సంప్రదించి మార్చి ఏడవ తేదీ లోపల ఇవ్వాలని, గతంలో ఇల్లు వచ్చిన వారు ఇప్పుడు అనర్హులు కనుక అర్హులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని రుద్రమ నాయుడు తెలిపారు

ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పులు..

విశాలాంధ్ర - జెఎన్టియు ఏ : బీటెక్ ఇంజనీరింగ్ లో ఆర్ 23 లోకరికులం 2023 సంవత్సరం లో మార్పులు చేయడం జరిగినదని, గతంలో మొదటి , రెండవ సంవత్సరం సిలబస్ మాత్రమే చేయడం జరిగినదని. ప్రస్తుతం మూడవ, నాలుగవ సంవత్సరం సిలబస్ మార్పులు చేస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన్ రావు తెలిపారు శుక్రవారం సిలబస్ మార్పులపై జవహర్ లాల్ నెహ్రూవిశ్వవిద్యాలయం కాన్ఫరెన్స్ హాలు లో బోర్డ్ అఫ్ స్టడీస్ మీటింగ్ సమావేశాన్ని ఉపకులపతి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం మార్చి 03 వ వారంలో సిలబస్ తయారు చేయడం ప్రణాళిక రూపకల్పన చేశామన్నారు. ప్రతి ఇంజినీరింగ్ విభాగంలో మైనర్ , హానర్ కోర్సులకు సంబంధించిన సిలబస్ కూడా చేయాలనీ నిర్ణయం తీసుకోవడం జరిగినదని తెలిపారు డి ఏ పి డైరెక్టర్ ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ నేతృత్వంలో చేపట్టారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. కృష్ణయ్య , ఓ ఎస్ డి వీసీ ఆచార్య ఎన్. దేవన్న, బోర్డ్ అఫ్ స్టడీస్ చైర్మెన్లు ఆచార్య పి.అర. భాను మూర్తి, ఆచార్య నాగ ప్రసాద్ నాయుడు, ఆచార్య ఆర్. కిరణ్మయి, ఆచార్య వి.బి. చిత్ర ఆచార్య టి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ సైన్సు దినోత్సవం

విశాలాంధ్ర-లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ సైన్సు దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు..ఈ సందర్భంగా సైన్సు ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేసి వివిధ ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఆయా ప్రయోగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను కూడా ప్రధానం చేసారు. అయితే 8 తరగతి విద్యార్థిని తనుజ ప్రత్యేక ప్రతిభ కనబరిచింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు. సైన్సు ఉపాధ్యాయులు గిరిధర్ ప్రసాద్, సరోజమ్మ, సత్యనారాయణరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను నిరాశ పరచిన బడ్జెట్

విశాలాంధ్ర-రొళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో ఉద్యోగులకు సంబంధించిన వేతన సవరణకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల్లో తీవ్ర నిరాశను నింపిందని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులు గౌస్ లాజమ్,మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 12వ వేతన సవరణకు సంబంధించి ఇప్పటికే రెండు సంవత్సరాలు ఆలస్యమైనప్పటికీ ఎన్నికల ముందు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని అస్సలు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు అదేవిధంగా బకాయిలుగా ఉన్న కరువు భత్యం ఇప్పటివరకు ఒకటి కూడా చెల్లింపు చేయకపోవడం ఉద్యోగుల సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వానికి గల నిర్లక్ష్యమునకు నిదర్శనమే కారణమని నేటి బడ్జెట్లో వేతన సవరణకు ఎటువంటి కేటాయింపులు కేటాయించలేదన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 35% మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు తమ ఆర్థికపరమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ చేపడతారని తెలిపారు.

పీ4 సర్వేను వేగవంతం చేయండి : ఎంపీడీవో

విశాలాంధ్ర-గుడిబండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పబ్లిక్ ప్రవేట్ పార్ట్నర్షిప్ పి4 సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి గుడిబండ మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు పి4 సర్వే చేయించుకోవడంలో ఎంతో ఉపయోగముందని అన్నారు. నిరుపేదలైన ప్రజలకు సంఘంలో ఆర్థికంగా బలోపేతమైన వ్యక్తుల నుండి ఆర్థిక మరియు మౌలిక సదుపాయాలు కల్పించుటకు పి4 సర్వే యొక్క ముఖ్య ఉద్దేశమని అలాగే గ్రామ సచివాల సిబ్బందికి పి4 సర్వేను వేగవంతం చేయాలన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్, వీఆర్వో రామప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై అనుచిత పోస్టులు పెట్టిన మహిళపై చర్యలు తీసుకోవాలి



విశాలాంధ్ర - యాడికి : సోషల్ మీడియాను వేదికగా చేసుకొని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై పదే పదే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఊరు చింతల గ్రామానికి చెందిన రేవతి అను మహిళపై యాడికి పోలీస్ స్టేషన్లో జనసేన మండల కన్వీనర్ కోడి సునీల్ కుమార్ జనసేన నాయకులతో కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫేస్ బుక్ వేదికగా గబ్బర్సింగ్ రేవతి అను ప్రొఫైల్ అకౌంట్ పేరుతో పవన్ కళ్యాణ్ ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ పోస్ట్ చేయడమే కాకుండా ఆయన గౌరవానికి భంగం కలిగే విధంగా పోస్టులు చేస్తోందని మండిపడ్డారు పాలసీ పరమైన విమర్శలు కాకుండా ఫేస్ మార్ఫింగ్ బాడీ షేమింగ్ మరియు వ్యక్తిగతమైన విమర్శలు చేయటం వైసిపి వారికి తగదని ఇకనైనా మానుకుంటే మంచిదని హితవు పలికారు రేవతి అను మహిళపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐ ఈరన్న, ఎస్ఐ రమణ ఫిర్యాదు చేశారు. ఉపాధ్యక్షులు జాకీర్ ప్రధానకార్యదర్శులు గుండ్ల శివ మధు ఆచారి బాబు రాజేష్ మల్లి నాగభూషణం జనసైనికులు పాల్గొన్నారు.